సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 14 । జనవరి । 2025





అడ్డురోడ్డు వద్ద కోడిపందేల నిర్వహణకు ఏర్పాట్లు

జోరుగా కోడి పందేలు

చేతులు మారుతున్న రూ.కోట్లు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఉమ్మడి విశాఖ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందేలు జోరుగా జరుగుతున్నాయి. ప్రధానంగా పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా టెంట్లు వేసి మరీ పందాలు నిర్వహించగా... మిగిలిన ప్రాంతాల్లో తోటలు, ఖాళీ స్థలాల్లో బరులు ఏర్పాటు చేసి పందేలు జరుపుతున్నారు. ఒక్కో బరి వద్ద రూ.వేలల్లో పందెం నడుస్తోంది. ఈ పందేలు చూసేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివస్తున్నారు. ప్రధానంగా కూటమి పార్టీల్లోని నేతలు ఈ కోడి పందేల నిర్వహణ సారథ్య బాధ్యతలు చేపట్టారు. మరోవైపు ఈ కోడి పందేలు కొనసాగుతున్న ప్రాంతాల వైపు వెళ్లొద్దంటూ అనధికారికంగా పోలీసులకు ఆదేశాలు ఉన్నట్టు సమాచారం. దీంతో కనుచూపు మేరలో కోడి పందేలు కొనసాగుతున్నా అటువైపుగా వెళ్లేందుకు ప్రయత్నించలేదు. మూడు రోజుల పాటు వీటిని నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేశారు. విశాఖ జిల్లాలో భీమిలి, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు.

- ఉమ్మడి విశాఖ జిల్లాలో పలుచోట్ల బరులు
- కోడి పందేలతో పాటు పేకాట, లాటరీ బాల్ నిర్వహణ
- పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో భారీగా నిర్వహణ
- చూసీచూడనట్టు ఉండాలని పోలీసు శాఖకు ఆదేశాలు



లాటరీ బాల్‌కు వేలం పాట!

ఈ కోడి పందేలు యలమంచిలి నియోజకవర్గంలో రామన్నపాలెం, పాయకరావుపేట నియోజకవర్గంలో అడ్డురోడ్డుతో పాటు అన్ని ప్రాంతాల్లో భారీగా జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పందేల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. వేలాది మంది ఆయా ప్రాంతాల్లో పోటీలను తిలకిస్తున్నారు. అయితే కోడి పందేలతో పాటు లాటరీ బాల్, పేకాటలను కూడా నిర్వహిస్తుండటం గమనార్హం. అక్కడకు వచ్చిన అనేక మంది ఆటవిడుపు కోసం వీటిని ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు చెబుతున్నారు. అంతేకాకుండా వీటి నిర్వహణ ఎవరికి దక్కాలనే విషయాన్ని తేల్చేందుకు లాటరీ నిర్వహించడం గమనార్హం. లాటరీలో దక్కించుకున్న వారు మాత్రమే కోడి పందేలు జరుగుతున్న ప్రాంతాల్లో లాటరీ బాల్, పేకాటలను నిర్వహించాల్సి ఉంటుంది. రూ.లక్షల్లో పాట పాడి వీటి నిర్వహణ బాధ్యతలను కూటమి నేతలు దక్కించుకున్నట్టు తెలుస్తోంది. ఒకవైపు హోం మంత్రి ఇలాకా.. మరోవైపు జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నియోజకవర్గాల్లోనే ఈ దఫా భారీగా కోడి పందేలు జరగడం గమనార్హం. ఇక నర్సీపట్నం, అనకాపల్లి, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లోనూ కోడి పందేలు జరుగుతున్నాయి.



అచ్యుతాపురం మండలం రామవరం వద్ద కోడి పందేలు



రూ.లక్షల్లో బెట్టింగ్‌లు...!

యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో రంజుగా పందేలు కొనసాగుతున్నాయి. దీంతో విశాఖ నగరానికి చెందిన పలువురు రాజకీయ నాయకులు అక్కడనే తిష్ట వేశారు. రూ.వేల నుంచి రూ.లక్షల్లో బెట్టింగులు వేస్తూ పందేలు నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ప్రధానంగా కూటమిలోని నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పందేల్లో సుమారు రూ. 2 కోట్ల మేర నగదు లావాదేవీలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అటు కోడి పందేలతో పాటు ఇటు లాటరీ బాల్, పేకాట కూడా నిర్వహిస్తున్నారు. అక్కడ భారీగా మద్యం కూడా బహిరంగంగానే సేవిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు జనం తరలివెళ్తున్నప్పటికీ కనీసం అటువైపు ఒక్క పోలీసు అధికారి కానీ.. ఎక్సైజ్ సిబ్బంది కానీ వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. వీటి నిర్వహణ కోసం అన్ని డిపార్టుమెంట్లకు భారీగా మామూళ్లు ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సింహగిరిపై సంక్రాంతి సంబరం



సింహాచలంలో రాజగోపురం ఎదురుగా భోగి మంట



సంబరాల్లో గంగిరెద్దులు, జంగం దేవర, కొమ్మదాసరి, హరిదాసులు



కుండలో పాలుపొంగిస్తున్న యువతులు

సింహాచలం:

సింహగిరిపై సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పండగ విశిష్టతను చాటుతూ, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా దేవస్థానం అధికారులు సంబరాలను నిర్వహించారు. భోగి పర్వదినాన స్వామివారిని దర్శించుకునేందుకు సింహగిరికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు సంక్రాంతి సంబరాలను కూడా తనివితీరా తిలకించారు. ఉదయం ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున వేసిన భోగిమంటను దేవస్థానం ఈవో వి.త్రినాథ రావు వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. అనంతరం భక్తులు పిడకలను భోగిమంటలో వేశారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ రాంబాబు పాల్గొన్నారు. సింహగిరి మాడ వీధుల్లో ఏర్పాటుచేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గొబ్బెళ్లు ముత్యాల ముగ్గులు, చెరుకు గెడల జాలువలు, ఎడ్లబండి, నాగళ్లు, పూరిగుడెసెలు, గడ్డిమోపులు, రంగులు వేసిన కుండలు, గోవులు, ట్రాక్టర్‌ను భక్తులు తిలకించారు. జంగం దేవర, కొమ్ముదాసరి, హరిదాసులు సంక్రాంతి సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గంగిరెద్ల విన్యాసాలు, కోలాటం ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ధాన్యం గుట్టల వద్ద మహిళలు సందడి చేశారు. కుండల్లో పాలు పోసి పొంగించారు. కుమ్మరి తయారుచేసే మట్టి వస్తువులను ఆసక్తిగా తిలకించారు. పూలతో చేసిన వరాహ స్వామి, శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యరూపం ఆకర్షణీయంగా నిలిచాయి.

మురిసిన పల్లెలు



నక్కపల్లి:

జనమంతా సొంతూళ్లకు పయనం.. ప్రతి ఇంటా పండగ కోలాహలం.. ముత్యాలముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసులు, గంగిరెద్దులతో పల్లెల్లో పండగ వాతావరణం.. పండగంటే మామూలు పండగా ఇది పెద్ద పండగ.. మకర సంక్రాంతి తరతరాలుగా తెలుగువారికి ఎంతో ముఖ్యమైనది. సంక్రాంతి నాడు సూర్యుడు మకర రాశిలో ప్రవేశిస్తాడు. దీనినే మకర సంక్రమణం అంటారు. ఈరోజు చాలా మంది పితృదేవతలకు తర్పణాలు ఇస్తారు. పురోహితులను ఇళ్లకు పిలిచి పితృదేవతల పేరున తమకు తోచిన రీతిలో స్వయంపాకం, నూతన వస్త్రాలు ఇచ్చి ఆశీస్సులు పొందుతారు. క్రాంతి అంటే ముందుకు సాగడం అని కూడా అంటారు. భగవంతుడు విశ్వవ్యాప్తంగా ఉన్నాడు కాబట్టి మనం చేసే సాధన, జ్ఞానం కూడా భగవత్ మార్గంగా ఉండాలని అర్థం. భగవంతుడు ఇచ్చిన దానిని ఆయనకే అప్పగించడం, అతిథులను గౌరవించడం, దానం వంటివి చేయాలి.

పిండి వంటల ఘుమఘుమలు

ఎక్కడెక్కడో ఉన్న వారు కూడా సంక్రాంతికి సొంతూరికి వస్తారు. కొత్త అల్లుళ్ల సంగతి సరేసరి. ఇలా ఇల్లంతా పిల్లా పాపలతో సందడి చేస్తుంటే తల్లికి ఎంతో ఆనందం. అరిసెలు, బొబ్బట్లు, బూరెలు సున్నుండలు వంటి సంప్రదాయ పిండి వంటలు చేసి ప్రేమారా చేతితో తినిపిస్తుంది. ఎంత పెద్ద వారైనా అమ్మలు, అమ్మమ్మల వద్ద గారాలు పోతూ వాటిని ఆరగించడం అదో ముచ్చట. పాయకరావుపేట, తుని ప్రాంతాలకు చెందిన అత్యధికులు రాష్ట్రం నలుమూలలలో ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఉంటున్నారు. శనివారం వీరంతా గోదావరి, విశాఖ, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లు, పాసింజర్ రైళ్లు, వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సుల్లో వేలాదిగా తమ స్వగ్రామాలకు తరలివచ్చారు. పాయకరావుపేట, తుని పట్టణాల నుంచి గ్రామాలకు వెళ్లేందుకు ఆటోలు, వ్యాన్‌లను ఆశ్రయించడంతో వాటికి కూడా డిమాండ్ పెరిగింది. కిక్కిరిసిన వాహనాలపై తమ గ్రామాలకు చేరుకుంటున్నారు.



వేంపాడు టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

టోల్‌గేట్‌ల వద్ద క్యూ కట్టిన వాహనాలు

జాతీయరహదారిపై వేంపాడు వద్ద ఉన్న టోల్‌గేట్ వద్ద వాహనాలు రద్దీ ఏర్పడింది. విశాఖ నుంచి విజయవాడ, రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళ్లే వాహనాల రాకపోకలతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. వేంపాడు టోల్‌గేట్ వద్ద వాహనాలు బారులు తీరాయి. ఫాస్టాగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో టోల్‌ఫీజు చెల్లించేందుకు వాహన చోదకులు పెద్దగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఎదురుకాలేదు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా టోల్‌ప్లాజా సిబ్బంది, పోలీసులు చర్యలు చేపట్టారు.

ప్రతి ఇంటా సంతోషం, సౌభాగ్యం వెల్లివిరియాలి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి

దేవరాపల్లి: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పర్వదినాన ప్రతి ఇంటా సంతోషం, సౌభాగ్యం వెల్లివిరియాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. స్వగ్రామం తారువలో సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జిల్లా ప్రజలకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఇల్లూ సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు.

ఘనంగా తొలి తీర్థం

చోడవరం: భోగి పండగ రోజు నుంచే తీర్థాలు ప్రారంభమయ్యాయి. ఆదిదేవుడైన చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద మొదటి తీర్థం జరిగింది. భోగి పండగను పురస్కరించుకొని విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి పట్టణ పురవీధుల్లో స్వామి తిరువీధోత్సవం నిర్వహించారు.

సాయంత్రం స్వామివారి ఆలయం వద్ద మొదటి తీర్థం జరిగింది. గ్రామీణ వాతావరణానికి అద్దం పట్టే బెలూన్లు, పిండివంటలు, పంచదార చిలుకలు అమ్మడంతో వాటిని కొనుగోలు చేసేందుకు అంతా ఆసక్తి చూపారు. రంగులరాట్నాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో తీర్థం అంతా సందడి చోటుచేసుకుంది. ఆలయం వద్ద 400మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, ఆలయ



చోడవరంలో తీర్థం సందడి

(మిగతా 8వ పేజీలో)

నేత్రపర్వం.. గోదా కల్యాణం

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో చివరిరోజైన సోమవారం భోగీనాడు ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, పి.వి.శేషాచార్యులు ఈ ఘట్టాన్ని స్వామివారి పుష్ప తోటలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం కొండపై మూలవిరాట్‌కు నిత్యార్చనలు, కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, స్వామి వారి ఉత్సవ ఉత్సవమూర్తులకు, ఆండాళ్లమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం 30వ పాశురం విన్నపం చేసి, స్వామివారి పుష్పతోటలో గోదాదేవి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. పాద ప్రక్షాళన, కన్యాదానం, కట్నాలు, శుభ ముహూర్తం, మంగళసూత్రధారణ, ఆశీర్వచనాలు తదితర ఘట్టాలు కనులపండువగా జరిగాయి.



కల్యాణకాంతులీనుతున్న గోదాదేవి అమ్మవారు, శ్రీరంగనాథుడు

నీరాజన మంత్రపుష్పం అనంతరం తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగంతో గోదాదేవి కల్యాణం ముగించారు. అనంతరం శ్రీదేవీ భూదేవి సమేతుడైన స్వామివారిని పుణ్యకోటి వాహనంలోనూ, అమ్మవారిని రాజాధిరాజ వాహనంలో ఉంచి తిరువీధుల్లో ఊరేగించారు. టీటీడీ వారు భక్తులకు ఉచిత ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అర్చక స్వాములు రాజగోపాలచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, ఎన్‌సీహెచ్ శ్రీనివాసాచార్యులు, తరిగొండ వేంగమాంబ సాహిత్య పీఠం వ్యవస్థాపకురాలు డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవి, శ్రీనివాసా భక్తసమాజం సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారి పుష్పతోటలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చక స్వాములు


వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

అల్లిపురం (విశాఖ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా చోడవరానికి చెందిన పుల్లేటి వెంకటేష్, రైతు విభాగం అధ్యక్షుడిగా బొడ్డేడ సూర్యనారాయణ, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా రుత్తల భాస్కరరావు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా గుర్రాల నాగేశ్వరరావు, ఇంటిలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడిగా పోకాల తిరుపతిరావులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

సందట్లో సడేమియా...!

- మైనింగ్ అధికారులు సీజ్ చేసిన ఇసుక మాయం!
- పండగ సెలవుల్లో రాత్రి వేళల్లో ఇసుక తరలించేందుకు ప్రయత్నాలు
- సీజ్ చేసి నెలలు గడుస్తున్నా చర్యలు శూన్యం
- పాత రెవెన్యూ అధికారుల బదిలీతో పర్యవేక్షణ కరువు


నాతవరం: మైనింగ్‌శాఖ అధికారులు సీజ్ చేసిన ఇసుకను పండగ సమయంలో గుట్టుచప్పుడు కాకుండా కూటమి నేతలు అధికార అండతో తరలించేందుకు ప్రయత్నం జరుగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే తాండవ నదిలో నిబంధనలు ఉల్లఘించి అనుమతులు లేకుండా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టారు. దీనిపై అప్పట్లో పత్రికల్లో వార్తలు రావడంతో మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి తాండవ నదిలో ఇసుక తవ్వకాలపై దాడులు చేశారు. చమ్మచింత వద్ద తాండవ నదిలో పొక్లెయిన్‌తో ఇసుక తవ్వకాలు జరిపినట్టుగా నిర్ధారించారు. కొంత మొత్తంలో ఇసుక తరలించగా మరికొంత ఇసుక చమ్మచింత గ్రామంలో నిల్వ చేసారు. నిల్వ చేసిన ఇసుకను గత ఏడాది అప్పటి తహసీల్దార్ ఎస్.ఎస్.వి శ్రీనివాసనాయుడు, మైనింగ్ అధికారులు పట్టుకోని సీజ్ చేశారు. అప్పట్లో పట్టుబడిన ఇసుక సుమారుగా 100 ట్రాక్టర్లు పైగా ఉంటుందని మైనింగ్‌శాఖ అధికారులు లెక్కించారు. పట్టుబడిన ఇసుక మైనింగ్‌శాఖ అధికారులు సీజ్ చేసి చమ్మచింత గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్దనే స్టాకు చేశారు. సీజ్ చేసిన ఇసుకను తరలించకుండా పర్యవేక్షణ బాధ్యత రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కొంతకాలం పాటు ఇసుక గుట్ట వద్ద రెవెన్యూ శాఖ సిబ్బంది నిత్యం పర్యవేక్షణ ఉండేవారు. అప్పట్లో పని చేసిన తహసీల్దార్ ఇతర సిబ్బంది బదిలీలో భాగంగా వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు.




చమ్మచింతలో సీజ్ చేసిన ఇసుకను ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే గుట్టగా వేసిన దృశ్యం

కొత్తగా వచ్చిన రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుకపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యం చేశారు. ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికార పార్టీ నాయకులు ఒత్తిడులకు తలొగ్గి కాలయాపన చేస్తున్నారు. సంక్రాంతి పండగ రావడం అధికారులు పూర్తిగా ఇసుకపై పర్యవేక్షణ కొరవడడంతో కొందరు గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో ఇసుక తరలించుకుపోతున్నారు. సీజ్ చేసిన ఇసున నిల్వలు రోజు రోజుకు తగ్గిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సంక్రాంతి పండగ సెలవులు కారణంగా రెవెన్యూ మైనింగ్‌శాఖ అధికారులు పూర్తిగా అందుబాటులో లేకపోవడంతో కూటమి నేతలు దర్జాగా ఇసుక తరలించే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా గ్రామంలో ప్రచారం జోరుగా జరుగుతుంది.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు





రోలుగుంట, మునగపాకలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నేతలు, వినియోగదారులు

- చార్జీల పెంపుపై సీపీఎం వినూత్న నిరసన

మునగపాక/రోలుగుంట: చార్జీలు తగ్గించాలని కోరుతూ భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి సోమవారం జిల్లా అంతటా నిరసన తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. మునగపాక మండలంలోని వెంకటాపురంలో సీపీఎం నేత గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామంటూ హామీలు గుప్పించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాట మార్చారన్నారు. ప్రజలపై చార్జీల భారం మోపారన్నారు. చిన్ని,సాయి, కృష్ణ అప్పారావు, చిన్ని కృష్ణ, సుందరపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రోలుగుంటలో సీపీఎం మండల కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దగ్ధం జరిగింది. ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటరు పెడితే పగలగొట్టండని చెప్పిన నాయకులు ఇప్పుడు స్మార్ట్ మీటరుతోపాటు రూ.11 వేల 800 కోట్ల భారం మోపారన్నారు. పెరిగిన చార్జీలను తగ్గించి స్మార్ట్ మీటర్లను వెనుక్కు తీసుకోకుంటే తాము చేపట్టబోయే భవిష్యత్ ఆందోళనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ

మునగపాక: మునగపాకలో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం మునగపాకకు చెందిన కొమ్మూరి శ్రీనివాసరావు–ప్రవల్లిక దంపతులు రూ.1,11,116, పాటిపల్లికి చెందిన ఆడారి సత్యనారాయణ రూ.2 లక్షలు, దాడి వెంకటరమణ, దాడి పరదేశినాయుడుల జ్ఞాపకార్థం వారి కుమారులు అశోక్ కుమార్, అరుణ్‌కుమార్ రూ.55,555, తిమ్మరాజుపేటకు చెందిన భీశెట్టి లక్ష్మణరావు రూ.50 వేలు, తిమ్మరాజుపేటకు చెందిన భీమిశెట్టి అప్పలనాయుడు కుమారులు గణేష్, డాక్టర్ భాస్కరరావు రూ.50 వేలు, వెంకటాపురానికి చెందిన రేఖా తాతారావు రూ.20 వేలు, మునగపాకకు చెందిన మళ్ల జగ్గప్పారావు రూ.50 వేలు వంతున విరాళంగా అందజేశారు. కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, పెద్దలు సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, ఆడారి అచ్చియ్యనాయుడు, కోనపల్లి రామ్మోహనరావు, పాలిమేర కృష్ణ, ఆడారి కృష్ణ, వెలగా సురేష్‌కుమార్, బొడ్డేడ రామునాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంచదార చిలక.. తీపి వన్నె మొలక



తీర్థాలు, ఉత్సవాల్లో చూడగానే చవులూరిస్తాయి...నోట్లో పెట్టుకుంటే తియ్యగా ఇట్టే కరిగిపోతాయి. సారె పెడితే అందరి కళ్లూ వాటిపైనే...పంచి పెడితే బంధువులు, స్నేహితుల మధ్య ఆత్మీయతను పెంచుతాయి. పంచవన్నెల చిలకలా..పంచదార చిలక అందరికీ విశేషంగా ఆకర్షిస్తుంది. సంక్రాంతి వచ్చిందంటే చాలు మన ఇంట్లో వాలిపోతుంది...

- సంక్రాంతిలో తియ్యని నేస్తాలు
- ఆకర్షించే రంగుల్లో రూపాల్లో..
- తీర్థాలు, ఉత్సవాల్లో జోరుగా అమ్మకాలు

కశింకోట : కశింకోటలో పంచదార చిలుకలు సంక్రాంతి సంబరాలకు సిద్ధమవుతున్నాయి. సంక్రాంతి, ఆ తర్వాత జరిగే తీర్థాలు, ఉత్సవాల్లో పంచదార చిలుకల విక్రయాలు జోరుగా సాగుతాయి. పిల్లలూ పెద్దలూ ఇష్టపడే తీపి చిలకలు కొందరు ముక్కువగా ఇళ్లకు తీసుకెళ్లి షో కేసుల్లో కొంత కాలం పెట్టుకొని అనక సేవిస్తారు. పంచదార చిలకలు సాధారణంగా గులాబీ రంగులో తయారు చేస్తారు. ఇపుడు పసుపు, కాషాయం, తెలుపు తదితర రంగుల్లో కూడా చేస్తున్నారు. చిలకల రూపంలోనే కాదు.. తాజ్ మహాల్, పన్నీరు బుడ్డి, ఆలయాలు ఇలా వివిధ రూపాల్లో సైతం కనువిందు చేస్తున్నాయి. సైజును బట్టి రూ.10 నుంచి రూ.వంద వరకు విక్రయిస్తుంటారు.

చిలుకల తయారీ ఇలా...

పంచదార చిలుకల తయారీ సులభమే. అయితే ముడి సరుకు పంచదార పాకం పదును చూడడంలో నేర్పరితనం ఉండాలి. పంచదారను పాత్రలో పోసి తగిన నీరు పోసి పాకం వచ్చే వరకు కట్టెల పొయ్యిపై మరగబెడతారు. ఆకర్షణ కోసం కొంచెం రంగు కలుపుతారు. పాకాన్ని ముందుగా తయారు చేసి ఉంచిన కావలసిన ఆకారంలో ఉన్న అచ్చుల్లో పోస్తారు. ఆరిన తర్వాత జాగ్రత్తగా అచ్చుల నుంచి తీస్తారు. కిలో పంచదారతో చిలుకల తయారీకి రూ.60 మజూరిగా తీసుకుంటారు.

తయారీ తగ్గింది...

పంచదార చిలుకల తయారు చేసే వారు క్రమేపీ కనుమరుగవుతున్నారు. దశాబ్దాల తరబడి 20 కుటుంబాల వరకు వీటిని ఇక్కడ తయారు చేసే వారు. శ్రీకాకుళం నుంచి వచ్చి స్థిరపడిన వడ్డెర కులానికి చెందిన సుమారు 20 కుటుంబాలు వరకు వీటిని తయారు చేసేవారు. వాటిని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగే సంక్రాంతి సంబరాలు, తీర్థాలకు తీసుకెళ్లి విక్రయించేవారు. జిల్లాలోని వడ్డాది, కొప్పాక తదితర ప్రాంతాల్లో కూడా పంచదార చిలుకలను తయారు చేస్తున్నారు. ఇప్పుడు కశింకోటలో పూర్వ వైభవం లేదు. కేవలం మూడు కుటుంబాలు మాత్రమే చిలుకలు తయారు చేస్తున్నాయి. ఆధునిక పోకడలతో ప్రత్యామ్నాయంగా స్వీట్లు రావడంతో వీటికి క్రమేపీ ఆదరణ తగ్గింది. తగిన ఆదాయం లేక ఆయా కుటుంబాలు ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్లిపోయారు. సాధారణంగా సంక్రాంతి సీజన్‌లోనే వీటికి ఆదరణ ఉంటుంది. తర్వాత సంప్రదాయం, ఆచారాల ప్రకారం కొన్ని కులాల వారు శుభకార్యాల్లో, ఉత్సవాల్లో సారెగా వీటిని తీసుకెళతారు. సంక్రాంతి సమయంలో రోజుకు సుమారు 20 కిలోల వరకు వీటిని తయారు చేస్తారు. మజూరి రూ.వెయ్యి పైగా మిగులుతుంది. సాధారణ రోజుల్లో పిండి పదార్థాలు, హాట్ వగైరా కొందరు తయారు చేసి విక్రయిస్తూ కాలం వెల్లబుచ్చుతారు. ఏళ్ల తరబడి ఇదే వృత్తిని కొనసాగిస్తున్నా రుణాలుగాని, రాయితీపై పంచదారను గాని ప్రభుత్వం అందివ్వడం లేదని తయారీదారులు ఆవేదన చెందుతున్నారు. వాటిని అందించి ఆదుకుంటే ఈ వృత్తిలో నిలదొక్కుకోవడానికి ఆస్కారం ఉంటుందంటున్నారు.





అచ్చుల నుంచి వెలికి తీస్తున్న పంచదార చిలుకలు, (ఇన్‌సెట్) అమ్మకానికి సిద్ధం చేసిన పంచదార చిలుకలు

ప్రోత్సహిస్తే నిలదొక్కుకుంటాం..

కశింకోటలో ఏళ్ల తరబడి పంచదార చిలుకలను తయారు చేస్తూ కుటుంబాలను అతి కష్టం మీద నెట్టుకొస్తున్నాం. ఆదరణ లేక ఇక్కడి చిలుకల తయారుదారులు ఉపాధి కోసం వలసలు వెళ్లిపోయారు. మొదటి నుంచి ఇదే వృత్తిని నమ్ముకొని ఇతర పనులు తెలియక గత్యంతరం లేక పంచదార చిలుకల తయారీ జీవనాధారంగా సాగిస్తున్నాం. ప్రభుత్వం రుణాలు, ముడి సరుకు పంచదారను రాయితీపై అందించి పంచదార చిలుకల తయారీ వృత్తి కనుమరుగు కాకుండా ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలి.

–అకుల దుర్గాప్రసాద్, కశింకోట

ఉత్సాహంగా గుర్రపు పరుగు పోటీలు



నూకాంబిక అమ్మవారి తీర్థంలో భాగంగా కోలాట ప్రదర్శన



గుర్రాన్ని పరుగెత్తిస్తున్న రౌతు

- జంపపాలెంలో వైభవంగా నూకాంబిక అమ్మవారి తీర్థం

యలమంచిలి రూరల్: జంపపాలెం గ్రామంలో సోమవారం నూకాంబిక అమ్మవారి తీర్థం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా భోగి పండుగ రోజున గ్రామ శివార్లలో పొలమరశెట్టి బ్రదర్స్ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తీర్థంలో భాగంగా గుర్రపు పరుగు పందేలు నిర్వహించారు. విజయనగరం,ఉమ్మడి విశాఖపట్నం, కాకినాడ జిల్లాల నుంచి 19 గుర్రాలు పోటీల్లో పాల్గొన్నాయి. దౌడు తీస్తున్న గుర్రాలను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పోటీలు నిర్వహిస్తున్న పొలాల వద్ద గుమిగూడారు. పలువురు యువకులు ఈ పోటీలను వీడియో చిత్రీకరణ చేసి సామాజిక మాధ్యమాల ద్వారా అందరూ చూసేలా చేశారు. పోటీల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన మణి, విజయనగరం జిల్లా నుంచి వచ్చిన సాయి వివేక్, లోవాంబిక (అనకాపల్లి), రాఖీ (కాకినాడ జిల్లా కోటనందూరు), చోడమాంబిక (రామన్నపాలెం,అచ్యుతాపురం) మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ నగదు బహుమతులను అందజేశారు. తీర్థంలో భాగంగా మహిళల కోలాట ప్రదర్శన, భజనలు ఆకట్టుకున్నాయి.

ఆధ్యాత్మిక పరిపూర్ణత

మహారాణిపేట: పరిపూర్ణత సాధించినప్పుడే మానవ జన్మ సార్థకమవుతుందని, దానిని సాధించడానికి మాస్టర్ పార్వతీకుమార్ రాసిన పుస్తకాలు ఉపకరిస్తాయని కోల్‌కత్తా ఇన్‌కమ్‌టాక్స్ కమిషనర్ బి.ఎస్.ఎన్.రాజు అన్నారు. జగద్గురుపీఠం ఆధ్వర్యంలో గురుపూజోత్సవాల ముగింపు సభ సోమవారం నిర్వహించారు. పార్వతీకుమార్ రచించిన 'అక్కల్ట్ మెడిటేషన్' అనే ఆంగ్ల వ్యాస్యాన్ని ఆవిష్కరించారు.

రసూల్ డెక్కర్ పరిశ్రమలో ప్రమాదం

- తీవ్రంగా గాయపడిన సిప్పర్ ఆపరేటర్
- కార్మికుడిని ఆదుకోవాలని సిటు డిమాండ్

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండలం ఎస్ఈజెడ్‌లోని రసూల్ డెక్కర్ ఫ్లైఉడ్ పరిశ్రమలో సోమవారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్మికుడు పోలిరాజును పరిశ్రమ యాజమాన్యం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. రసూల్ డెక్కర్ ప్లైఉడ్ పరిశ్రమలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రం రాయగడ గ్రామానికి చెందిన నిద్దన పోలిరాజు (29) సోమవారం పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో చేయిని కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన పోలిరాజును విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారని, ప్రస్తుతం కార్మికుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, అతని కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు రాము కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్మికుడికి మెరుగైన వైద్య సేవలందించి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉద్యోగి పోలరాజు

జువనైల్ హోమ్‌కు బాలుడి తరలింపు

- లైంగిక దాడి బాధితురాలికి ప్రజా సంఘాల పరామర్శ

యలమంచిలి రూరల్: ఏటికొప్పాకలో నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న 13 ఏళ్ల బాలుడిని దర్యాప్తు అధికారి పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ ఆదేశాలతో యలమంచిలి రూరల్ పోలీసులు విశాఖలోని జువనైల్ హోమ్‌కు తరలించారు. శనివారం సాయంత్రం టీడీపీ వార్డు సభ్యురాలి 13 ఏళ్ల కుమారుడు సామాజిక మాధ్యమాల్లో పోర్న్ వీడియో చూసి ఆ ప్రభావంతో నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసిన విషయం తెలిసిందే. బాలుడిపై పోలీసులు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. బాధితురాలైన నాలుగేళ్ల చిన్నారిని సోమవారం సిఐటీయూ, ఐద్వా, రైతు సంఘాల నాయకులు పరామర్శించారు. చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ అఘాయిత్యానికి ఒడిగట్టిన బాలుడ్ని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా పోలీసులు కేసు దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలని, బాధితురాలైన చిన్నారికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు సిహెచ్ మంగ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు నగిరెడ్డి సత్యనారాయణ, సీఐటీయూ యలమంచిలి డివిజన్ నాయకుడు చింతకాయల శివాజీ పాల్గొన్నారు.

ఘనంగా తొలి తీర్థం

(7వ పేజీ తరువాయి)



స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద జనంతో కిటకిటలాడిన కూరగాయల తీర్థం

ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలిపతిరావు, ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబ తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన కూరగాయల తీర్థం

జిల్లాలో ఎక్కడా జరగని విధంగా చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద సందడిగా కూరగాయల తీర్థం జరిగింది. సంక్రాంతి పండగలో రైతులు పండించిన కొత్త పంటలే ముఖ్యం కావడంతో ఆ పంటలను ఈ తీర్థంలో విక్రయిస్తారు. ప్రధానంగా చోడవరం పరిసర గ్రామాల్లో పండిన రకరకాల కూరగాయలన్నీ ఈ తీర్థంలో అమ్మకానికి ఉంచారు. ఈ కూరగాయల తీర్థంలో కూరగాయలు కొనుగోలుచేసి సంక్రాంతి రోజున పూజ చేస్తే మంచి జరుగుతుందని ప్రతీతి. భోగి పండగను మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తన కుటుంబసభ్యులతో సోమవారం తన స్వగ్రామమైన కేజే పురంలో సందడిగా జరుపుకొన్నారు. స్థానిక రామాలయంలో భజనలు, కీర్తనలు ఆలపించారు.

భలే ప్రేమ 'చిహ్నం'



కళ్లల్లో ఉదయించి.. కనుమూసినా.. తోడుంటుంది ప్రేమ. శిశిరమైనా.. శిథిలమైనా.. ప్రేమమయమే సుమా అని అన్నాడో కవి. ప్రేమిస్తే.. ప్రపంచమంతా మనసిచ్చిన మనిషిలోనే కనిపిస్తుంది. విరిసే ప్రతి పువ్వులోనూ.. కురిసే ప్రతి చినుకులోనూ ప్రేమ కనిపిస్తుందంటారు. ఇదిగో.. ఇప్పుడీ బంగాళా దుంపలోనూ ప్రేమకు చిహ్నం పలకరిస్తోంది. లలితానగర్‌లో కూరగాయలు అమ్మే కొరిబిల్లి మహేష్ తీసుకొచ్చిన బంగాళాదుంపల్లో.. ఈ దుంప మాత్రం అందర్నీ ఆకట్టుకుంది. గుండె గుప్పెడంత కాదు.. ఈ బంగాళా దుంపంత అని చెప్పుకుంటున్నారు. ఇంకొందరు ఈ దుంపని చూసి.. ఏంటో ఈ దుంపలో ప్రేమ అని మాట్లాడుకున్నారు.

–ఫొటో : సాక్షి, విశాఖపట్నం

సంక్రాంతికీ రోడ్లు దుర్భరమే..



గోతులమయంగానే దర్శనమిస్తున్న చింతనిప్పల అగ్రహారం

తుమ్మపాల: కూటమి నాయకుల ప్రగల్భాలు విని ఆశపడ్డ జనం వాస్తవాలు గమనించి పెదవి విరుస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో రోడ్లకు చేపట్టిన మరమ్మతులు తాత్కాలికంగా మిగిలిపోయాయి. మళ్లీ గోతుల మయంగానే దర్శనమిస్తున్నాయి. మండలంలో తుమ్మపాల నుంచి మామిడిపాలెం వరకు రోడ్డుపై ప్రయణించిన వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఆ మార్గంలో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అనేక మంది గోతులమయంగా ఉన్న రహదారిపై రాకపోకలు చేయలేక గత ప్రభుత్వంలో పూర్తిచేసిన కేబీ రోడ్డును ప్రత్యామ్నాయంగా చేసుకుంటున్నారు. మార్టూరు మాకవరం రోడ్డు మరింత దారుణంగా తయారైంది. ఆయా గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పలుమార్లు స్థానిక ఎమ్మెల్యేకు వినతులు ఇచ్చినా పట్టించుకున్న పరిస్థితి లేదు. చింతనిప్పల అగ్రహారం రోడ్డుపై చెరువును తలపించేలా గోతులు ఏర్పడ్డాయి. జాతీయ రహదారిని ఆనుకుని శంకరం వద్ద గల బొజ్జన్నకొండ రోడ్డుపై గోతుల్లో పడి వాహనాలు నిలిచిపోతున్నాయి.

సింహగిరిపై కనుల పండువగా గోదా కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహగిరిపై సోమవారం సాయంత్రం గోదా రంఘనాథుల కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామికి శ్రీకృష్ణాలంకారం చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో వేంజేంపజేశారు. గోదాదేవి అమ్మవారిని మరో పల్లకిలో అధిష్టంపజేశారు. రెండు పల్లకీలను మాడ వీధుల్లో తిరువీధిగా తీసుకెళ్లి ఎదురు సన్నాహోత్సవాన్ని విశేషంగా జరిపించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామిని, అమ్మవార్లను వేంజేంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, అక్షింతలను అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఎదురు సన్నాహోత్సవంలో అర్చకులు పూలదండలతో నృత్యాలు చేస్తూ అలరించారు.

పందెం కోళ్లు సహా జూదగాళ్ల అరెస్ట్



ఉగ్గినపాలెం వద్ద పోలీసులకు పందెం కోళ్లతో పట్టుబడిన వ్యక్తులు

కశింకోట/అచ్యుతాపురం: ఉగ్గినపాలెం గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతుండగా తమ సిబ్బందితో ఆకస్మికంగా దాడి చేసి ఐదుగుర్ని పట్టుకొని సోమవారం అరెస్టు చేశామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రెండు పందెం కోళ్లు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే అచ్యుతాపురం మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన జూద స్థావరాలపై పోలీసులు దాడులు జరిపారు. సెజ్ కాలనీలో పేకాట ఆడుతున్న పలువుర్ని అదుపులోకి తీసుకొని రూ.750 నగదు స్వాధీనం చేసుకున్నారు. రామన్నపాలెం పరిధిలో కోడిపందాల స్థావరాలపై దాడులు జరిపి రెండు కోడి పుంజులు, రూ.2100 స్వాధీనం చేసుకున్నారు. అచ్యుతాపురం పరిధిలో బల్లాట నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని రూ.1020 స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

తీడలో ఘనంగా ఎన్టీఆర్ తీర్థం



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

కశింకోట: తీడ గ్రామంలో ఎన్టీఆర్ తీర్థ మహోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్లపై కేసు

రూ.8,920 స్వాధీనం

అనకాపల్లి: జూదం ఆడుతున్న ఐదుగురిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టణంలో పెద్ద రెల్లివీధి వెనుక భాగాన జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.8,920 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కన్నూరుపాలెంలో 40 మంది రక్తదానం

కశింకోట: లైఫ్ ఆఫ్ గివింగ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కన్నూరుపాలెం హైస్కూలులో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 40 మంది ఉత్సాహంగా వచ్చి రక్తదానం చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు, గాజువాక అమ్మబ్లడ్ బ్యాంకుల నుంచి వైద్య, ఆరోగ్య సిబ్బంది వచ్చి రక్తాన్ని సేకరించి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాలను తాకిన సూర్య కిరణాలు



రామాలయంలో సీతారాముల విగ్రహాలను తాకుతున్న సూర్య కిరణాలు

కశింకోట: స్థానిక గవరపేటలో శారదా గణపతి రామాలయంలో సీతారాముల విగ్రహాలను సోమవారం సూర్య కిరణాలు తాకాయి. తూర్పునకు అభిముఖంగా ఆలయం ఉండటంతో ఇక్కడ మూల విరాట్‌కు కిరణాలు తాకాయి. దీంతోపాటు భోగి కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. 108 దీపాలతో నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వర రావు, అర్చకుడు చింతా సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు.

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	:సత్యనారాయణ స్క్రీన్-2
సంక్రాంతికి వస్తున్నాం	:పర్తిసాయి
గేమ్ ఛేంజర్	:షిర్డీసాయి
గేమ్ ఛేంజర్	:వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	:శ్రీసత్య
డాకు మహారాజ్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 73 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-25 యూనిట్లు, ఓ పాజిటివ్-38 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 426 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

భోగి భాగ్యాలు..



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో వేంకటేశ్వరస్వామి విగ్రహం వద్ద మహిళలు



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో పల్లె వాతావరణంలో మహిళలు

- పల్లె లోగిళ్లలో వేడుకగా పండగ
- ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సంక్రాంతి సంబరాలు
- ఆకట్టుకున్న రంగవల్లులు



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో చెరకు గెడలు వద్ద మహిళలు



అనకాపల్లి: తెలుగువారి పెద్ద పండగ రానే వచ్చేసింది. సంక్రాంతి సంబరాల్లో మొదటి రోజైన సోమవారం భోగి పండుగ ఘనంగా జరిగింది. ఇంటిల్లిపాదీ వేకువజాము లేచి భోగి స్నానాలు చేశారు. దుంగలు, పిడకలు, కమ్మలు వంటి వాటితో భోగి మంటలు కాశారు. స్థానిక మాజీ ఎంపీ కార్యాలయం ఆవరణలో మాజీ ఎంపీ బీవీ సత్యవతి తన కుటుంబ సభ్యులతో కలసి భోగి మంటలు వెలిగించి ఆనందంగా వేడుక నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ భోగభాగ్యాలు ప్రసాదించాలని భగవంతుడ్ని వేడుకున్నారు. సంక్రాంతి నుంచి అన్ని వర్గాల వారు సుఖ సంతోషాలతో తులతూగాలని ఆకాంక్షించారు. హరిదాసులు, గంగిరెద్దులవారికి బియ్యం, వస్త్రాలు సమర్పించారు.

– స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పులివేషాలు, కోయ డ్యాన్స్, భరతనాట్యం వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రంగవల్లులు ఆకట్టుకున్నాయి.

– పట్టణంలోని వేల్పులవీధి, తాకాశివీధి, కోట్ని వీధి, మళ్ల వీధి, శారదా కాలనీ, గాంధీనగరం, నర్సింగరావుపేట, గవరపాలెం పాలు ప్రాంతాల్లో, మండలంలో 32 పంచాయతీ పరిధిలో భోగి మంటలు ఆయా ప్రాంతాల ప్రజలు నిర్వహించారు.

ఆనందోత్సాహాలతో..

కశింకోట: మండలంలోని భోగి పండుగను సంప్రదాయబద్ధంగా ఆనందోత్సాహాలతో ప్రజలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువకులు పలుచోట్ల పెద్ద భోగి మంటలు వేసి సందడి చేశారు. కశింకోటలోని గవరపేట, కస్పావీధి, సంత బయలు, హౌసింగ్ కాలనీ, గోవిందరావు కాలనీ, సత్తెమ్మ కాలనీ, ఉప్పునీటి దిబ్బ, కనకమహాలక్ష్మి వీధి, తదితర ప్రాంతాల్లో భోగి మంటలు వేశారు. వాటి చుట్టూ చేరి స్థానికులు ఆనందోత్సాహంతో మంట కాగారు. చలి నుంచి ఉపశమనం పొందారు. బయ్యవరం, తాళ్లపాలెం, నరసింగబిల్లి, కన్నూరుపాలెం, జమాదులపాలెం, ఉగ్గినపాలెం తదితర గ్రామాల్లో భోగి మంటలు వేశారు.



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో భోగిమంట వద్ద మహిళలు



తన కార్యాలయం వద్ద కళాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ సత్యవతి

అంతంత మాత్రంగానే..

తుమ్మపాల: మండలంలో సంక్రాంతి సంబరాలు ఈ ఏడాది అంతంత మాత్రంగానే మొదలయ్యాయి. ఏ ఇంటి చూసినా అలికిడి కనిపించడం లేదు. ఉద్యోగం, విద్య, వ్యాపార రీత్యా పలు చోట్ల స్థిరపడిన వారు సంక్రాంతికి సొంతూరుకు వచ్చి మూడు రోజుల పాటు చేసే హడావుడి ఎక్కడా కనిపించడం లేదు. ధనుర్మాసం నుంచి మకర రాశిలోకి ప్రవేశించే భోగి పండుగ బోసిపోయింది. కుటుంబ సభ్యులంతా ఏకమై చేసుకునే చలి మంటలు వీధుల్లో కనుమరుగయ్యాయి. మండలంలో గ్రామాల్లో భోగి మంటల సందడి, సంబరాల సవ్వడి లేక వెలితిగానే గ్రామాలు దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఒక్క సంక్షేమ పథకాలు అందించకపోవడం, ప్రభుత్వం వచ్చి ఆర్నెల్లలోనే నిత్యావసరాల ధరలు రెట్టింపు అవ్వడంతో ప్రజల జీవన స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పండక్కి నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు కూడా నగదు లేక, అప్పు ఇచ్చే నాథులు లేకపోవడంతో ఉసూరుమంటున్నారు. కొన్ని కుటుంబాలు పస్తులుంటున్న పరిస్థితులు కూడా కూటమి ప్రభుత్వంలో మొదలయ్యాయి. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పరంపరతో ప్రజలు పండుగలను సంతోషంగా జరుపుకున్నారు. కూటమి ప్రభుత్వంలో వీటి ఊసే లేదు.



కశింకోటలో భోగి మంట



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న చిన్నారులు



భోగి మంట వేస్తున్న మాజీ ఎంపీ సత్యవతి



కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో భోగిమంట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో కోయడ్యాన్స్

'జగనన్న కాలనీల పేరు మార్చితే ఉద్యమిస్తాం'

అనకాపల్లి: కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జగనన్న కాలనీల పేరు మార్పు చేస్తూ ఇచ్చిన జీవోలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో బడుగు, బలహీన వర్గాల వారు బుద్ధిచెప్పే రోజులు దగ్గర పడుతున్నాయని జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకం జోసెఫ్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలకు సెంటున్నర స్థలంలో గృహాలు నిర్మిస్తుంటే, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు అది మృతదేహాన్ని పూడ్చడానికి సరిపోదని, మూడు సెంట్లు ఇవ్వాలని చెప్పారన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి తర్వాత జగనన్న కాలనీలు పేర్లు మార్చడం తగదన్నారు. ముందు ప్రతి పేద వాడికి మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీ పేరు మార్చినట్లయితే లబ్ధిదారులతో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

లక్ష్మీనృసింహస్వామి ఊరేగింపు



కశింకోటలో లక్ష్మీనృసింహస్వామి రథం ఊరేగింపు

కశింకోట: లక్ష్మీనృసింహస్వామిని గ్రామ వీధుల్లో రథంపై ఘనంగా ఊరేగించారు. భోగి పురస్కరించుకొని స్వామివారితోపాటు లక్ష్మీ దేవి ఉత్సవ విగ్రహాలను రథంపై నిలిపి డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దారి పొడవునా నిరీక్షించి స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. కొంతసేపు రథాన్ని ముందుకు లాగి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. సంక్రాంతి సందర్భంగా మంగళవారం స్వామివారి ఊరేగింపు జరగనున్నట్లు ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి తెలిపారు.



లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భోగి మంటలో విద్యుత్ బిల్లులు వేసి నిరసన



భోగి మంటలో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలుపుతున్న సీఐటీయూ జిల్లా నాయకులు

కశింకోట: విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కశింకోటలో సీఐటీయూ నాయకులు వినూత్న నిరసన తెలిపారు. భోగి మంటలో విద్యుత్ బిల్లులను వేసి దహనం చేశారు. జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం పెంచుతున్న ట్రూఅప్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతి పక్షంలో చార్జీల పెంపును వ్యతిరేకించి టీడీపీ నాయకులు అధికారంలోకి రాగానే ప్రజలపై మోపడమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యుత్ బిల్లులు తగ్గించాలని, స్మార్టు మీటర్లు అమర్చరాదన్నారు. ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి, ప్రతినిధులు ఝాన్సీ, సరిత, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



సీపీఎం కార్యాలయం వద్ద భోగి మంటలో విద్యుత్ బిల్లును వేస్తున్న దృశ్యం

అనకాపల్లి: పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని డిమండ్ చేస్తూ సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద భోగి మంటల్లో పార్టీ నేతలు విద్యుత్ బిల్లులను దహనం చేశారు. పార్టీ మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కూటమి నాయకులు అధికారంలోకి రాకముందు విద్యుత్ చార్జీలు పెంచిన గత ప్రభుత్వంపై బాదుడే బాదుడు అంటూ గగ్గోలు పెట్టారని, ఇప్పుడు రూ.2,500 కోట్ల పెంచడానికి ఆమోదం తెలపడం దారుణమన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రుత్తల శంకరరావు మాట్లాడుతూ 2000లో రూ.వెయ్యి కోట్ల విద్యుత్తు చార్జీలు పెంచితేనే ప్రజలు తిరుగుబాటు చేసి చంద్రబాబు ప్రభుత్వాన్ని గద్దె దించారని, నేడు మరలా వేల కోట్ల భారాన్ని మోపడం అన్యాయమన్నారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ



నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బల్లా నాగభూషణం



గవరపాలెంలో బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

అనకాపల్లి: పేదలు సంక్రాంతి వేడుకలు ఆనందంగా జరుపుకోవాలని సిద్ధార్థ సోసల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం ఆకాంక్షించారు. స్థానిక చిన్నరాజుపేట సాంబశివ దేవాలయం ఆవరణలో నిరుపేదలకు సోమవారం ఆయన రూ.10 వేలు విలువ చేసే దుస్తులు పంపిణీ చేశారు. 12 ఏళ్లుగా భోగి రోజు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. సంక్రాంతి వేడుకల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుపేదల కళ్లలో సంక్షేమ వెలుగులు నింపిందన్నారు. ఏటా సంక్రాంతికి ఏదో ఒక సంక్షేమ పథకం అందజేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెంలో...

స్థానిక గవరపాలెం పార్కు సెంటర్ వద్ద బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో 300 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, చైర్మన్ పి.ఎస్.అప్పారావు, అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకస్వామి ఆలయంలో అభిషేకాలు నేడు

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం(శివాలయం)లో సంక్రాంతి పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయని అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణ తెలిపారు. స్వామివార్లను పల్లకిలో గ్రామంలో ఊరేగించనున్నట్లు చెప్పారు. సోమవారం భోగి పురస్కరించుకుని అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే ఎస్సీ వర్గీకరణ కుట్ర

దేవరాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రతోనే ఎస్సీ విభజించే ప్రయత్నం చేస్తున్నారని ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు ఆరోపించారు. ఈ మేరకు దేవరాపల్లిలోని శ్రీ సన్యాసమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయుకుల సమావేశం జరిగింది. ఎస్సీ,ఎస్టీ చట్టాలను పటిష్ట పరిచి, దళితులకు రావాల్సిన సబ్‌ప్లాన్ నిధులను రాబట్టి, దళితుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మండల నాయుకులు కార్లి సాయి సుందరరావు, మచ్చ వీర్రాజు, తాడి అప్పారావు, మచ్చ రామారావు, సబ్బవరపు మాలిబాబు, ఉల్లి దేముళ్లు, కంచిమాల అప్పారావు, ఉల్లి శ్రీను, కె. అప్పారావు పాల్గొన్నారు.

కమనీయంగా గోదాదేవి కల్యాణం



కశింకోటలో వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో గోదాదేవి కల్యాణోత్సవం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి శ్రీరంగనాథుల కల్యాణం కమనీయంగా జరిగింది. ప్రధాన అర్చకులు రేజేటి గోపఅప్పలాచార్యులు(చక్రవర్తి), మారుతిల ఆధ్వర్యంలో వ్యాపారి ఓబులరెడ్డి దంపతులతో ఈ వేడుక నిర్వహించారు. అనంతరం కల్యాణంలో పాల్గొనే భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీకాంత్, రేజేటి శ్రీరామ్, శ్రీనివాస్, తేజ, హేమంతు, భక్తులు పాల్గొన్నారు.

దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో...

స్థానిక దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి శ్రీరంగనాథుని కల్యాణాన్ని ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు, రాజేష్, ప్రసాద్ అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం అలయానికి వచ్చే భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో రాజా సులోచన, కూటమి నేతలు పాల్గొన్నారు.

మూడు ఆలయాల్లో...

కశింకోట: ధనుర్మాసోత్సవాల ముగింపులో భాగంగా సోమవారం మూడు ఆలయాల్లో గోదాదేవి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో ఉదయం నిర్వహించగా, దేవాదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం, గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో రాత్రి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామితోపాటు గోదాదేవి ఉత్సవ విగ్రహాలను అందంగా పూలతో అలంకరించి సంప్రదాయంగా వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు సీతారామాచార్యులు, మారుతిల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు ఎక్కువగా హాజరయ్యారు. వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులు ఎక్కువగా హాజరయ్యారు. గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామితోపాటు గోదాదేవిల ఉత్సవ విగ్రహాలకు అర్చకుడు చింతా సుబ్రహ్మణ్యం, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ఘనంగా కల్యాణం జరిపించారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథ కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయంలో పాశుపత హోమం నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం 12వ పౌర్ణమి పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ప్రధాన అర్చకుడు రేజేటి రామానాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం, నిరాజన మంత్ర పుష్పములు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ మండపంలో అమ్మవారికి 473 కలశాలతో అష్టోత్తర పూజలు, పాశుపత హోమం చేశారు. కార్యక్రమంలో ప్రతిష్ట శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు



473 కలశాలతో అమ్మవారి ఆలయంలో అష్టోత్తర పూజలు